క్లుప్తంగా

పైడమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాదాలు పంపిణీ

పెడన: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలో ఉన్న శ్రీపైడమ్మ ఆలయం వద్ద ఆదివారం సుమారు 1500 మంది భక్తులకు అన్నప్రసాదాలను అందించినట్లు ఆలయ ఈవో జి.వెంకట కృష్ణారావు తెలిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఆసాది వెంకట రామారావు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన మంత్రి నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు బుద్ధు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేదపండితులు నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ, మణిదీప్ శర్మ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. మంత్రి వెంట స్థానిక టీడీపీ నాయకులు, ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల జాతర

కృత్తివెన్ను: మండల పరిధిలోని సంగమూడి గ్రామంలో గ్రామదేవతలైన మారెమ్మ, పోలేరమ్మ, పుంతలో ముసలమ్మల జాతరను ఘనంగా నిర్వహిచారు. ఏటా శ్రావణమాసంలో నిర్వహించే ఈ జాతరను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముందుగా అమ్మవారికి చలినైవేద్యాలను సమర్పించి అనంతరం గణాసారులు, భక్తులతో కలసి కనకడప్పుల వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగారు. తరువాత అమ్మవారి గద్దెల వద్ద పూజలు జరిపారు. వేడి నైవేద్యాలను అమ్మవార్లకు సమర్పించారు. గ్రామ ఆడపడుచులు బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఆకట్టుకున్న శ్రీకృష్ణుడి రథం ఊరేగింపు



కోడూరు: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణుడి రథం ఊరేగింపు విశేషంగా ఆకట్టుకుంది. కోడూరు మెరకగౌడపాలెంలోని రామాలయం వద్ద నుంచి యాదవ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. ముందు భాగంలో ఐదు గుర్రాలు, వెనుక భాగంలో వెంకన్న ఆలయ సెట్టింగ్‌తో కూడిన రథంపై కృష్ణ భగవానుడిని కోడూరు పురవీధుల వెంట ఊరేగించారు. రథం ముందు డీజే పాటలకు అనుగుణంగా యువత తీన్‌మార్ డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, హోమియో వైద్య శిబిరాలు

చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యుడు మోహనరావు 50 మందికి పరీక్షలు జరిపి వారిలో 17 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విజయవాడలోని అమరావతి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ళ వెంకటరత్నం తెలిపారు. దీంతో పాటు నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 28 మందిని పరీక్షించి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. కోశాధికారి జూపూడి కిరణ్, సభ్యులు ద్రోణ, దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్, మలిశెట్టి చెంచురాములు శిబిరాలను పర్యవేక్షించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చల్లపల్లి: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని వీఆర్‌వోలు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తగు ముందు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డి.వనజాక్షి ఆదేశించారు. ముఖ్యంగా తీర గ్రామాలైన నడకుదురు, నిమ్మగడ్డ, వెలివోలు, ఆముదార్లంక గ్రామాలకు చెందిన ప్రజలు ఎవరూ లంకల్లోని పొలాలకు గానీ, నదిలోకి గానీ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గుండేరు డ్రెయిన్ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. భారీ వర్షాల సమాచారాన్ని ముందస్తుగా గ్రామాల్లో చాటింపు వేయించాలని సూచించారు.

అమ్మో! మరో అల్పపీడనమా

- వచ్చే మూడు రోజులు విస్తారంగా వర్షాలు
- ఇప్పటికే ఐదు రోజుల నుంచి నీటిలోనే నానుతున్న నారుమళ్లు, వరిదుబ్బులు
- ఆందోళన చెందుతున్న దివిసీమ రైతాంగం



కోడూరు మండలం విశ్వనాథపల్లిలో ఐదు రోజుల నుంచి నీటిలో నానుతున్న వరిదుబ్బులు



నాగాయలంక మండలం చోడవరంలో నీటమునిగి కుళ్లిపోయిన నారుమడి

అవనిగడ్డ: దివిసీమలో ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం వల్ల నీటమునిగిన పంటపొలాలు ఇంకా తేరుకోలేదు. సోమవారం మరో అల్పపీడనం ఏర్పడనుందనే వార్తలు దివిసీమ రైతులను కలవరపెడుతున్నాయి. మరో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

వర్షాలు పడితే కోలుకోలేని దెబ్బ

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ ఖరీఫ్‌లో 86వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు 26వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఇంకా 14వేల ఎకరాల్లో నారుమళ్లు, వరిపంట నీటిలో ఉంది. సోమవారం మరో అల్పపీడనం పడనుందని, దీనివల్ల రానున్న మూడు రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయనే వాతావరణ అధికారుల హెచ్చరికలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నారు. నీట మునిగిన నారుమళ్లు, వరి దుబ్బులు పాచిపోయి కుళ్లి చనిపోతున్నాయి. బయట పడితే ఎంతో కొంత ఉపయోగ పడుతుందనే ఆశతో ఉన్న రైతులు మరోసారి వర్షం పడితే ఈ పొలాలు ఇక తేరుకోవని వాపోతున్నారు.

కదలని మురుగు

ఐదు రోజుల క్రితం కురిసిన వర్షం మురుగు ఇంకా పూర్తిగా పోలేదు. డ్రైనేజీ, పంటకాలువ పనులు సరిగా చేయక పోవడం, డ్రైన్లలో గుర్రపుడెక్క పేరుకుపోవడం, గత ఐదు రోజుల నుంచి కృష్ణానదికి వరద రావడం వల్ల మురుగు త్వరగా పోవడం లేదని కొంతమంది రైతులు చెప్పారు. వరద నీరు సముద్రానికి పోటెత్తడం వల్ల మురుగు కూడా అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ద్వారా సముద్రంలో కలవడం వల్ల ఎగదన్నుతుందని రైతులు చెప్పారు.

పంట పొలాలను వీడని ముంపు

- ఐదు రోజులైనా చెరువులను తలపిస్తున్న పొలాలు
- వరిదుబ్బులు దెబ్బతింటాయని రైతుల ఆందోళన



వి.కొత్తపాలెం సమీపంలో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

కోడూరు: వర్షాలు తొలగి ఐదు రోజుల గడిచినా కూడా వరి పొలాలు ముంపు బారి నుంచి నేటికీ తేరుకోలేదు. కృష్ణానదికి వచ్చిన భారీ వరదతో పాటు సముద్రం ఎగతన్నడంతో డ్రెయిన్లలో మురుగు నీరు దిగువకు పారే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వరి పొలాలు మొత్తం చెరువులను తలపిస్తున్నాయి. కోడూరు మండలంలోని లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం, మాచవరం, విశ్వనాథపల్లి, చినగుడుమోటు, దింటిమెరక, కోడూరు గ్రామాల్లో వరిపొలాలు ఇంకా నీటిలోనే నానుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఐదు రోజులైనా పొలాల్లో నీరు వెళ్లకపోవడంతో పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. వరిదుబ్బులు కుళ్లిపోయి పంట పోతుందని ఆందోళన చెందుతున్నారు. రత్నకోడు, లింగన్నకోడు డ్రైన్ల ప్రక్షాళన పనుల్లో నిర్లక్ష్యం కారణంగానే నేడు తమకు ఈ పరిస్థితి వచ్చిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు పంటపై ఆశ వదిలేసుకుని నారుమడి కొనుగోలు చేసి మళ్లీ వరినాట్లు వేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పంట దెబ్బతిన్న పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం..

ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మళ్లీ నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో రైతులకు కునుకు పడడం లేదు. ఒక రోజు కురిసిన వర్షానికే పంట పొలాల్లో నీరు ఇప్పటికీ బయటకు పోయే పరిస్థితి లేదని, మళ్లీ వర్షాలు వస్తే పొలాల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదని వాపోతున్నారు. నీటిలో నుంచి కొద్దిగా తేరుకున్న పొలాలు కూడా మళ్లీ ముంపు బారిన పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరింత జాప్యం

నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో కొన్నిచోట్ల నారుమళ్లు నీటమునిగాయి. ఐదు రోజుల నుంచి నీటిలో ఉండటం వల్ల నారుమళ్లు చనిపోతున్నాయి. పంటపొలాల్లో మురుగు పోతే గానీ మళ్లీ నారుమళ్లు పోసుకునే అవకాశం ఉండదు. మళ్లీ వర్షాలు ఉంటాయని చెప్పడంతో నారుమళ్లు పోసుకోవడం ఇంకా ఆలస్యం అవుతుందని, దీనివల్ల వరిసాగు మరింత జాప్యం అవుతుందని రైతులు చెప్పారు. దీంతో రెండో పంట మినుము సాగుపై ప్రభావం చూపుతుందని రైతులు చెప్పారు. ఇప్పుడిప్పుడే పంట పొలాలు బయట పడుతున్న తరుణంలో మరోసారి వర్షాలు పడితే ఇక ఆశలు వదులు కోవడమేనని కొంతమంది రైతులు వెల్లడించారు.

అరకొర బస్సులతో ఆడపడుచుల కష్టాలు

బస్సు ఆపకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్న మహిళలు



చల్లపల్లి బస్టాండు ఆవరణలో కరకట్ట బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తున్న ప్రయాణికులు

శ్రీకాకుళం(ఘంటసాల): ఉచిత బస్సు సంగతేమో కాని మహిళలకు ఉచితంగా కష్టాలు వచ్చిపడ్డాయని పలువురు మహిళలు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సులు శ్రీకాకుళం స్టేజీ వద్ద కొన్ని సెకన్లు కూడా ఆపకుండా బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలను ఎక్కించుకోకుండా వెళ్లిపోతున్నారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పెట్టినందుకు ఆనందపడాలో, బస్సు ఎక్కేందుకు అవకాశం లేకుండా పోతున్నందుకు బాధపడాలో అర్థం కావడం లేదంటూ మహిళలు వాపోతున్నారు. శ్రీకాకుళం నుంచి విజయవాడ వెళ్లేందుకు పలువురు మహిళలు సుమారు గంటన్నరకు పైగా వేచి చూస్తున్నారు. రెండు మూడు బస్సులు వచ్చినా వాటిలో ఒకరిద్దరు తప్ప అందరూ ఎక్కేంత వరకు బస్సులు ఆపకుండా క్షణాల్లోనే ముందుకు పోనిచ్చేస్తున్నారు. బస్సులో ఖాళీ లేదంటూ ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారని మహిళలు వాపోతున్నారు. శ్రీకాకుళం నుంచి విజయవాడ వెళ్లేందుకు సాయంత్రం 5 గంటలకు బస్సు కోసం వచ్చామని రాత్రి 6.45 గంటల లోపు మూడు బస్సులు వచ్చినా ఒక్క బస్సు కూడా అందరూ ఎక్కే వరకు ఆపడం లేదని, దీంతో బస్సు ఎక్కలేని పరిస్థితి నెలకొందని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఉచిత ప్రయాణానికి తగిన బస్సులు లేనప్పుడు ఇలా అరకొర బస్సులు పెట్టి మహిళలను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదంటున్నారు. సోమవారం నుంచి కళాశాలలు, పాఠశాలలు, ఉద్యోగాలకు బస్సుల్లో వెళ్లాలంటే ఎన్ని కష్టాలు పడాలో అంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

చల్లపల్లి: విజయవాడ వెళ్లేందుకు కరకట్ట బస్సుల కోసం ప్రయాణికులు ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో గంటల తరబడి పడిగాపులు కాశారు. ముఖ్యంగా ప్రతి పావు గంటకు ఒకటి చొప్పున రావాల్సిన కరకట్ట బస్సులు గంటల తరబడి రాకపోవకటంతో క్రమంగా ప్రయాణికుల సంఖ్య పెరిగిపోయింది. విసుగెత్తిన కొందరు ప్రయాణికులు నలుగురైదుగురు అద్దె కార్లు మాట్లాడుకుని వెళ్లారు దీనిని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి కరకట్ట బస్సు కోసం వేచి ఉన్నామని 3.30 సమయంలో ఒక బస్సు రాగా అప్పటికే అది పూర్తిగా నిండిపోయి ఉండటంతో, ఆపకుండా వెళ్ళిపోయిందని కొందరు ప్రయాణికులు చెబుతున్నారు. మళ్లీ 5 గంటల వరకూ కరకట్ట బస్సు రాలేదని వాపోయారు. అవనిగడ్డ డిపో నుంచి విజయవాడకు 18 కరకట్ట బస్సులు ప్రతిరోజూ తిరుగుతున్నాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రతి పావు గంటకు ఒకటి చొప్పున రావాల్సిన కరకట్ట బస్సులు రెండు నుంచి ఐదు గంటల మధ్యలో కేవలం ఒక్కటే బస్సు వచ్చిందని ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. మూడు రోజులు సెలవులు రావటం, దీనికి తోడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం తోడవటంతో చల్లపల్లి బస్టాండు ఆదివారం కిక్కిరిసిపోయింది. ఉదయం విజయవాడ వెళ్లిన కరకట్ట బస్సుల్లో కొన్ని తిరిగి రావటం ఆలస్యం కావటం వల్ల ఈ ఇబ్బంది నెలకొందని డిపో మేనేజర్ హనుమంత రావు తెలిపారు.

ఆర్టీసీకి ఆదాయం లోటు

ఒక్కరోజుకే అవనిగడ్డ డిపోకు రూ.4.36 లక్షల నష్టం

చల్లపల్లి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో అవనిగడ్డ ఆర్టీసీ డిపో ఆదాయానికి గణనీయంగా గండి పడింది. డిపోలో 85 బస్సులు నడుపుతుండగా వాటిద్వారా ప్రతి రోజూ సగటున రూ.11 లక్షలు ఆదాయం వచ్చేది. ఈనెల 15వ తేదీన స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. శనివారం అవనిగడ్డ డిపోకు చెందిన బస్సులో మొత్తం 15,045 మంది ప్రయాణికులు ప్రయాణించారు. వారిలో 9,565 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. శనివారానికి మొత్తం రూ.12,88,103 ఆదాయం రావాల్సి ఉండగా అందులో రూ.4.36 లక్షలు ఆదాయం లోటు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ఒక్క రోజులో ఒక్క అవనిగడ్డ డిపోకే రూ.4.36 లక్షలు ఆదాయం తగ్గితే రాష్ట్రం మొత్తం మీద ఎంత ఆదాయం లోటు ఉంటుందో ఆలోచించటానికే భయం వేస్తోందని సామాజిక వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో మరింత నష్టాల ఊబిలోకి కూరుకుపోనుందా? అని కొందరు ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు: మండల పరిధిలో 33 కేవీ లైన్లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున సోమవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు గూడూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మల్లవోలు, పోలవరం, రాయవరం, రామన్నపేట, ఐదుగుళ్లపల్లి గ్రామాలకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

సొసైటీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబును సన్మానిస్తున్న బండి రామకృష్ణ తదితరులు

చల్లపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లను విజయపథంలో నడిపిస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. స్థానిక శ్రీరామలింగ చౌడేశ్వరీ కల్యాణ మండపంలో నూతనంగా ఎన్నికైన సొసైటీ చైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, పర్సన్స్ వేముల హరికృష్ణ, ఆలూరి విశ్రాం తమ్మల సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. బండి రామకృష్ణ, అగ్నికుల కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయరాధిక తదితరులు పాల్గొని నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వైద్యుల బృందం



216 జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటుతున్న వైద్యుల బృందం

చల్లపల్లి: వైద్యుల బృందం ఆదివారం స్వచ్ఛ సుందర చల్లపల్లి సందర్శించారు. స్వచ్ఛ రథసారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతిలతో కలిసి గుంటూరు మెడికల్ కళాశాలలో 1974లో వైద్య విద్యను అభ్యసించిన ఈ వైద్యులు స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించారు. చల్లపల్లిని సందర్శించేందుకు వీరు శనివారం సాయంత్రమే వచ్చారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన కోలాటం, కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఆదివారం ఉదయం స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొని 216 జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటారు. గతంలో వారు నాటిన మొక్కల ఎదుగుదలను చూసి సంబరపడ్డారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి గత 11 సంవత్సరాలుగా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న డీఆర్కే దంపతుల సేవలను అభినందించారు. తాము కూడా ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం

స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలకు మన కోసం మనం ట్రస్టుకు వైద్యులు నాగమణి రూ.20వేలు తన వంతుగా విరాళాన్ని డీఆర్కే ప్రసాద్‌కు అందజేశారు. హిందూ శ్మశానవాటిక నిర్మాణానికి ఎన్ఆర్ఐ మురారి సాత్విక్ ఇచ్చిన రూ.10 వేలు విరాళాన్ని ఆయన తండ్రి మురారి శివశంకర్ అందజేశారు.

ఆధ్యాత్మిక శోభతో పులకించిన పాలకాయతిప్ప

- కనులపండువగా సాగిన కోదండ రాముడి ఆలయ, విగ్రహ ప్రతిష్ట
- ధ్వజస్తంభ ప్రతిష్టలో అశేషంగా పాల్గొన్న భక్తజనం



ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన స్వామివార్ల విగ్రహాలు



క్రేన్ సహాయంతో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ట

కోడూరు: వేద పండితుల మంత్రోచ్చరణలు.. మంగళవాయిద్యాలు.. బాణసంచా వెలుగులు.. జై శ్రీరామ్.. అంటూ భక్తులు భక్తిపారవశ్యంతో చేసే నినాదాల నడుమ కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ట కనులపండువగా నిర్వహించారు. మండలంలోని పాలకాయతిప్ప గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆదివారం ఉదయం శ్రీసీతా కోదండరామ సమేత లక్ష్మణ, హనుమాన్ స్వామివార్ల నల్లరాతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో స్వామివార్ల విగ్రహాలను భక్తుల జయజయ ధ్వానాల నడుమ ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం ఆలయ ముందు భాగంలో ధ్వజస్తంభ ప్రతిష్టను కూడా కనులపండువగా జరిపారు. ముందుగా గోపూజ చేసి ధ్వజస్తంభాన్ని భారీ క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. శిఖరానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం శిఖర ప్రతిష్టను జరిపి, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

వేలాదిగా పాల్గొన్న భక్తజనం..

పాలకాయతిప్ప గ్రామంలో ఏకకాలంలో నూతన ఆలయ, విగ్రహం, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్టలు ఉండడంతో వీటిని తిలకించేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. మచిలీపట్నంకు చెందిన శతాధిక ప్రతిష్ఠాచార్యులు మునగలేటి వంశీశర్మ, పండితులు మొవ్వ శివాజీ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం పలువురు ప్రముఖులు ఉభయదాతలుగా వ్యవహరించి సీతారామచంద్ర స్వామివార్ల శాంతి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు సుదూర ప్రాంతాల నుంచి సైతం తరలి రావడంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనను నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు ఈ అన్నదానంలో పాల్గొన్నారు. అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, జనసేన యువనేత మండలి వెంకట్రామ్, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రతిష్టలో పాల్గొని, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యుత్ ఏఈ రవికుమార్‌కు సత్కారం



ఘంటసాల: గ్రామీణ ప్రాంతంలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్న ఘంటసాల మండల విద్యుత్ శాఖ ఏఈ పి.రవి కుమార్ సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఉయ్యూరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఏఈగా రవికుమార్ ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఘంటసాల పెద్దగూడెం యువకులు ఆదివారం ఏఈ రవికుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో దిరిశం రాజు, కొడాలి సమూయేలు, దిరిశం శ్రీను, కొండపల్లి పిచ్చేశ్వరరావు, లైన్‌మన్ కె.దేవసుందరరాజు, షిఫ్ట్ ఆపరేటర్ కె.ప్రసాద్, పెద్దగూడెం యువకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రభు



గూడూరు: విజయవాడ సిద్దార్థ మెడికల్ కళాశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ జట్టుకు గూడూరు మండలం కప్పలదొడ్డికి చెందిన బి.శివనాగప్రభు ఎంపిక య్యాడు. ఈనెల 29 నుంచి ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శివ నాగ ప్రభును పలువురు అభినందించారు.

సీనియర్ కౌన్సిలర్ కటకంను పరామర్శించిన మాజీ మంత్రి జోగి



పెడన: మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి భర్త కటకం ప్రసాద్‌ను మాజీ మంత్రి జోగి రమేష్ ఆదివారం పరామర్శించారు. కటకం ప్రసాద్ గుండెకు స్టంట్ వేయించుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన మాజీ మంత్రి జోగి రమేష్ కటకం ప్రసాద్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దివ్యాంగుని కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత



మచిలీపట్నంటౌన్: బందరు మండలం గరాలదిబ్బ గ్రామానికి చెందిన దివ్యాంగుడు అంద్రాజు ఏసుబాబు కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఏసుబాబు రెండేళ్ల క్రితం వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు హై వోల్టేజ్ విద్యుత్ లైన్‌ను తాకడంతో తీవ్ర గాయాల పాలై కుడి కాలు, కుడి చేయిని కోల్పోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఏ పనీ చేయలేక మంచానికే పరిమితమై, భార్య చేసే కూలీనాలీ పనులపైనే ఆ కుటుంబం ఆధారపడింది. గ్రామ పెద్ద బొడ్డు వీర వెంకటేశ్వరరావు (నాని) ద్వారా విషయం తెలుసుకున్న మైత్రీ ఫౌండేషన్ బృందం తాత్కాలిక సాయంగా ఆదివారం ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసింది. భవిష్యత్తులో వారికి వైద్య పరంగా కూడా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కేసాని వేణు కుమార్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి దైవపు రాధాకృష్ణ, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.